www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 జూన్ 2025 | 5 | తూర్పుగోదావరి



అంతర పంటలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లిలో సోమవారం ముళ్లపూడి మురళీకృష్ణ తోటలో పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. జాజికాయ, దాల్చిన చెక్క, మిరియాలు పంటల ప్రాముఖ్యతను కేరళకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ స్పైస్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ డి.ప్రసాద్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, ఎఐసిపి డాక్టర్ లిజోథామస్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ నిస్సార్ తదితరులు పాల్గొన్నారు. అంతర పంటల్లో శాస్త్రీయ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వెంకటస్వామి, రీజనల్ హెచ్ఆర్‌సి అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రసాద్, రిటైర్డ్ డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ బివికె.భగవాన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఆటో భద్రమేనా..?

- కిక్కిరిసిన ఆటోల్లో పాఠశాలలకు
- పరిమితికి మించినా పట్టించుకోని అధికారులు
- పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యార్థులను బడిచేర్చే ఆటోలు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆటో డ్రైవర్ల ఆత్యాస తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఉదయం 9 గంటల లోపు సాయంత్రం 4 గంటల తర్వాత నగర వీధుల్లో కిక్కిరిసిన బడి ఆటోలు దర్శనమిస్తున్నాయి. ఒకొక్క ఆటోలో కనీసం 10 నుంచి 14 మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారు. తాజాగా నూతన విద్యా సంవత్సర ప్రారంభమైన విషయం విధితమే. మధ్య తరగతి, సాధారణ ప్రజలు తమ చిన్నారులను బడికి తీసుకుని వెళ్లే సమయం లేక ఆటోలు లేదా స్కూలు బస్సుల ద్వారా తమ చిన్నారులను స్కూళ్లకు పంపించడం పరిపాటి. యాజమాన్యాలు, రవాణా శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండటంతో స్కూలు బస్సులను ప్రతి ఏటా వాహనాల తనిఖీలు, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు జారీ చేసిన అనంతరమే విద్యార్థుల ప్రయాణాలకు వినియోగిస్తున్నారు. స్కూలకు చేర్చే ప్రయివేటు వాహనాలపై ఆ తరహా పర్యవేక్షణ లేకపోవటం కలవరానికి గురిచేస్తోంది. అతి వేగం, ఎంత మంది పిల్లలను ఎక్కిస్తే అంత ఆదాయం అనే ఆలోచనలోనే డ్రైవర్లు ఉంటున్నారు. ఇదే ప్రమాదాలకు ముఖ్యకారణంగా మారుతుంది. స్కూలు పిల్లలను బడిచేర్చేందుక ఆటోలకు రవాణా శాఖ నుంచి ప్రత్యేకమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. దీంతో ఆటో డ్రైవర్లు యదేచ్ఛగా ప్రవర్తిస్తున్నారు. చిన్నారుల భద్రతను గాలికొదిలేస్తున్నారు.

ఇరుకు రహదారుల్లోనూ అతివేగం

జిల్లాలో సుమారు 15 వేల ఆటోలు ఉంటాయని అంచనా. ఎక్కువ శాతం ఆటోలు ప్రధాన రహదారుల నుంచి కాక సందుల్లో, చిన్నచిన్న రోడ్ల వెంట పిల్లలను తీసుకెళ్తుండడంతో వీటిపై నియంత్రణ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆటోలపై తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను కుక్కి అతివేగంగా డ్రైవర్లు ఆటోలను తోలుతున్నారు. ఒకవైపు పాఠశాల సమయం ముగుస్తుందని గేటు వేస్తారని ముందు వెనక చూసుకోకుండా దూసుకు వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యంతో పాఠశాలల ఆటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రైవేట్ బస్సులకు ఫీజులు చెల్లించే స్తోమత లేని కారణంగా తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను ఆటోలో పంపించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పల్లెల నుంచి ఆర్టీసీబస్సులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అధిక మొత్తంలో ఆటో డ్రైవర్లకు వెచ్చిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

అప్పి ఆటోలు, టాటా మ్యాజిక్ లాంటి వాహనాలను పాఠశాల విద్యార్థులను తరలించేందుకు జిల్లాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాలకు సంబంధించి ఎప్పటి నుంచో ఉన్న నిబంధనలను ఆటో డ్రైవర్లు పాటించడం లేదు. సాధారణ ఆటోలలో విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించకూడదు. టాటా మ్యాజిక్‌లో 10 మందికి మించకూడదు. డ్రైవర్ల పక్కన ఎట్టి పరిస్థితుల్లో కూర్చోపెట్టకూడదు. స్కూల్ ఆటోలకు సైడురాడ్లు తప్పక అమర్చాలి. ప్రతీ స్కూల్ ఆటోలో ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి. ఆటోలకు సంబంధించిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎఫ్‌సీ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. డ్రైవర్ యూనిఫాం తప్పని సరిగా ధరించాలి. ఈ నిబంధనలు పాటించకుండా పోలీసు, రవాణాశాఖ దారుల్లో పట్టుబడితే జరిమానాలు భారీగా ఉంటాయని అధికారులు తెలుపుతున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడి ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే భారీ జరిమానాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

ఆటోల్లో డ్రైవర్ సీటుకు అటు, ఇటు, లోపల కాస్తా కూడా ఖాళీ లేకుండా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆటోలలో విద్యార్థుల రాకపోకలు మాత్రం ఆగడం లేదు. ఏదైన ప్రమాదం జరిగిన తర్వాత బాధపడేకంటే తల్లిదండ్రులు ముందే మేల్కొనాలి. బడి పిల్లలను ఆటోలలో స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు ఆటోలలో అసలు ఎంత మంది వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారు అనే విషయం ముందుగానే తెలుసుకోవాలి. ఆటో డ్రైవర్ పూర్తి వివరాలు ప్రతీ తల్లిదండ్రుల వద్ద ఉండాలి. డ్రైవర్ ఎంత స్పీడ్‌లో వెళ్తున్నాడో, పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. ఆటో సమాచారాన్ని సంబంధిత పాఠశాలలకు తల్లిదండ్రులే అందించాలి. స్కూల్ యాజమాన్యాలు, సిబ్బంది కూడా వారి స్కూళ్లకు ఎక్కువ మంది పిల్లలను తీసుకువచ్చే ఆటోలను అనుమతించకూడదు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే స్కూళ్లకు చెడ్డపేరు వస్తుందని యాజమాన్యం కూడా గుర్తించాలి. ఆటో ప్రయాణాలపై బాధ్యతగా మెలగాలి.

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సంక్షేమ పథకాలను అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు సోమవారం ధర్నాకు దిగారు. ఈ ధర్నాను ఉద్దేశించి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.బేబిరాణి మాట్లాడారు. సాధికార సర్వేలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపారన్నారు. దీంతో వారికి సంక్షేమ పథకాలు అమలు కావట్లేదన్నారు. అంగన్‌వాడీలకు రూ.12వేలు, హెల్పర్లకు రూ.7వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. కాని ప్రభుత్వ వేతనం పొందుతున్నారు కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులే అనడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో అంగన వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింప జేస్తామని కూటమి నాయకులు హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా తమను మోసం చేశారన్నారు. తక్షణమే సంక్షేమ పథకాలను అమలు చేయాలని, కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యూటీకి సంబంధించి కొత్త జిఒను విడుదల చేయాలన్నారు. అంగన్‌వాడీలకు పెన్షన్ పంపిణీని కూడా అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పవన్ ఈ ధర్నాకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. జులై 9న జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ, ఉపాధ్యక్షులు సిహెచ్.అన్నపూర్ణ, నాయకులు బి.మార్తమ్మ, కె.సుబ్బలక్ష్మి, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, మాలతి, మార్తా, సిఐటియు నాయకులు జువ్వల రాంబాబు, బి.పూర్ణిమరాజు, కెఎస్‌వి.రామచంద్ర రావు, రాంబాబు, రాజేష్ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలపై సత్వర చర్యలు

ప్రజాశక్తి- కొవ్వూరు

పిజిఆర్ఎసలో ప్రజల అర్జీలపై సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు, కెఆర్ఆర్‌సి తహశీల్దార్ బి.అచ్యుతకుమారి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె పాల్గొని 15 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ అధికారులు పిజిఆర్ఎస్‌లో తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు. ప్రధానంగా కొవ్వూరు పట్టణానికి చెందిన విత్తం జగన్నాథరావు, 30 సెంట్లు భూమిని సర్వే చేయించాలని అర్జీ పెట్టుకున్నారు. ముక్కా మల గ్రామానికి చెందిన ముసలి నాగపండు మా ఇంటి ముందు పంచాయతీ స్థలంలో అనధికారకంగా ఇల్లు నిర్మిస్తున్నారు. కావున సమస్య ను పరిష్కరించాలని అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దోమ తెరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి-నల్లజర్ల

స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దోమతెరలను సోమవారం పంపిణీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను ప్రామాణికంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ తెలిపారు. కొత్తగూడెం శివారు చెంచులు, పూరె గుడిసెల్లో ఉంటున్న వారికి వీటిని అందించారు. అనంతరం ఇవాంజలిన్ మాట్లాడారు. మండలంలోని నల్లజర్ల ఉప్పర్ల కాలనీ, కొత్తగూడెం కాలనీ, పోతవరం శివారు కాలనీ, ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం. కొత్త ఉంగుటూరు, చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలోని పేదలకు ఇప్పటికే దోమతెరలు పంపిణీ చేశామన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం పరిసరాల్లోని క్వారీ కార్మికులకు మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఈ వారంలోనే దోమతెరలు పంపిణీ చేస్తామన్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహనా సదస్సు, భారీ ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జివివి.ప్రసాద్ నేతృత్వంలో నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఉన్నతాధికారులను ఆహ్వానిస్తున్నామన్నారు.

విద్యా హక్కు చట్టానికి తూట్లు

ప్రజాశక్తి -కొవ్వూరు

మండలంలో విద్యాహక్కు చట్టానికి ప్రయివేటు విద్యాసంస్థలు తూట్లు పొడుస్తున్నాయి,. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు ఇతర సామగ్రిని అమ్ముతూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. కొవ్వూరులో నారాయణతో పాటు పలు విద్యాసంస్థలు పుస్తకాల విక్రయం ద్వారా వ్యాపారం చేయడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ఆదివారం పలు విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. విద్యాహక్కు చట్టాన్ని అతిక్రమించిన పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడుతూ ఎల్‌కెజి విద్యార్థుల నుంచి పుస్తకాల కోసం రూ.3,500 వసూలు చేయడం దారుణమన్నారు.

నిడదవోలులో సీజ్ చేసిన యూనిఫామ్

పుస్తకాలు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామని కొవ్వూరు ఎంఇఒలకు తెలియజేసినా స్పందించలేదన్నారు. తక్షణం జిల్లా స్థాయి ఉన్నతాధికారులు జిల్లాలో ఉన్న అన్ని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. పుస్తకాలు, యూనిఫామ్, షూలు, బ్యాగులు, ఇతర మెటీరియల్ అమ్మకాలను అడ్డుకుని, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జ్యోతి, హేమత్, కార్తీక్, లహరి, మౌళి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు : పట్టణంలో నారాయణ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా, స్కూల్ యూనిఫామ్ అమ్ముతుండడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. రూ.2.50 లక్షల విలువైన స్కూల్ యూనిఫామ్ సీజ్ చేసినట్లు ఎంఇఒ గురుమూర్తి తెలిపారు.

ఆర్ఎంసి కార్యాలయంలో 'విద్యోన్నతి'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుకొని 2024-25 విద్యా సంవత్సరానికి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియర్ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ కార్యక్రమం సోమవారం ఆర్ఎంసి కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభకు అహర్నిశలు కృషి చేసిన అధ్యాపక బందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో నగర పాలక సంస్థకి చెందిన 13 ఉన్నత పాఠశాలల నుంచి 176 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. వీరందరూ 'విద్యోన్నతి కార్యక్రమం' ద్వారా వారికి నచ్చిన కళాశాలలో చదువుకునేందుకు నగరపాలక సంస్థ అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేఉకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐ దిలీప్‌కుమార్, ఆర్ఐఒ నరసింహారావు, ఆర్ఎంసి మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్‌మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సిహెచ్.శ్రీనివాసరావు, హెచ్ఎంలు, విద్యార్థులు, ప్రయివేటు కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలను తీర్చడమే ధ్యేయం

ప్రజాశక్తి - సీతానగరం

రైతులకు సాగునీటి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన పురుషోత్తపట్నంలో తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఐదేళ్ల వైసిపి విధ్వంస పాలనలో ఎత్తిపోతల పథకాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. కనీసం కాలువల్లో పూడిక కూడా తీయించకుండా జాప్యం చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణమే కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించాలని, ప్రతి సంవత్సరం కంటే వారం రోజుల ముందుగానే ఈ ఏడాది రైతులకు సాగునీటిని విడుదల చేయాలని, అవసరమైన తాత్కాలిక మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మోటార్లు, పైప్‌లైన్‌లను మార్చడంతో పాటు, కాలువలకు రిటైనింగ్ వాల్స్ నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. చైర్మన్ శ్రీను, వైస్ చైర్మన్ రాజు సహకారంతో పూడికతీత పనులు పూర్తిచేసి రైతులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమని నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

రాజ్యాంగాన్ని కాపాడాలని ర్యాలీ

ప్రజాశక్తి-కడియం

ప్రజాస్వామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా కడియంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టికె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. నరేంద్ర మోడీ, అమిత్‌షాలు భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి, హిందూ రాజ్యంగా మార్చాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. నరేంద్ర మోడీ ఇప్పటివరకు రెండు వందల ముప్పై ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి కూడా ఇంత అప్పు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను ఏడు బుల్లెట్ పాయింట్ల రూపంలో పొందుపరిచినట్లు, వాటిని కరపత్రం రూపంలో ముద్రించినట్లు తెలిపారు. ఇంటింటికి కాంగ్రెస్ పేరుతో ఒక ఉద్యమంలా ఈ కరపత్రాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జనరల్ సెక్రటరీ అరిగెల అరుణకుమారి, రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు కాకర్ల హరిబాబు, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు జెటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఉండ్రాజవరం ఎఒగా రాజారావు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల వ్యవసాయ అధికారిగా బి.రాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన గోపాలపురం ఎఒగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉండ్రాజవరానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు సంబంధించిన పథకాలను అమలు చేయడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఉండ్రాజవరంలో విధులు నిర్వర్తించిన ఎం.విశ్వాసరావు తాడేపల్లిగూడెంకు బదిలీపై వెళ్లారు.

తంటికొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తంటికొండ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపిపి సుంకర శ్రీవల్లి, వైసిపి నాయకులు సుంకర వీరబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టే డ్రెయినేజీ పనులకు, రూ.8లక్షలతో చేపట్టే కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపిపి మాట్లాడుతూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఎంపిపి నిధులు రూ.18 లక్షతో ఈ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బదిరెడ్డి సత్యనారాయణమ్మ, వైస్ ఎంపిపి మడిక మైనర్‌బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

పెరవలి ప్రాజెక్టులోని నిడదవోలు సెక్టార్ పరిధిలో సింగవరం, తీరుగూడెం, సుబ్బరాజుపేట, వైఎస్ఆర్ కాలనీ అంగన్‌వాడీ కార్యాలయాల వద్ద సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.లక్ష్మి మాట్లాడారు. 3 నుంచి ఐదేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యను అంగన్‌వాడీ టీచర్లు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగవరం ఉప సర్పంచ్ వరదా రామరాజు, సచివాలయ సిబ్బంది బి.రవి, కె.విజయలక్ష్మి, అంగన్‌వాడీలు సుజాత, రమణ, జ్యోతి కుమారి, ఇందిరా, రత్నశ్రీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు

ప్రజాశక్తి-గోకవరం

విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని జుహని హాలోనెన్ అన్నారు. సోమవారం కృష్ణునిపాలెం ఎంపియుపి స్కూల్లో ఎస్ఎంసి చైర్మన్ అమర వెంకటరామయ్యతో కలిసి ఆయన బ్యాగులు, పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఎన్నో సదుపాయలను కల్పిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి చైర్మన్ అమరా వెంకట రామయ్య కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం ఎఎస్ఒగా వెంకట్

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం సహాయ గణాంక అధికారిగా జోడాల వెంకట్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తాళ్లపూడి నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తహశీల్దార్ అజయ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనతో పాటు ఆర్.ఐ హరీష్, విజన్ భాగస్వామి బాజీ ఉన్నారు.

గోపాలపురం ఎఒగా ఏసుబాబు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎఒగా కూచిపూడి ఏసుబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో మండపేటలో విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గోపాలపురం వచ్చారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయ సాగులో రైతులకు తగిన సలహాలు సూచనలు అందిస్తాన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను, సబ్సిడీ విత్తనాలను, పనిముట్లను రైతులకు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

3 రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పెరవలి

మండలంలో మల్లేశ్వరం 33 కెవి/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి మల్లేశ్వరం ఫీడర్ ఆర్‌డిఎస్ఎస్ పనులు కారణంగా మంగళవారం నుంచి గురువారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇఇ ఎన్.నారాయణఅప్పారావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి

ప్రజాశక్తి - హరాజమహేంద్రవరం రూరల్

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం నిర్వహించిన కార్యాక్రమంలో ఆమె మాట్లాడారు. సికిల్ సెల్ ఎనీమియా నివారణకు ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. గతంలో మన్యంలో మాత్రమే ఈ వ్యాధికి వైద్యసేవలు అందేవన్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న గిరిజనులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం సర్వే నిర్వహించి, గిరిజనులకు వైద్యసేవలు అందిస్తోందన్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి 40 ఏళ్లలోపు వారి నుంచి రక్త నమూనాలు సేకరించి, వారికి చికిత్సలు అందిస్తున్నారన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం పట్టణ ప్రాంత ఆసుపత్రులకు పంపుతున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 14,312 మంది గిరిజనులు ఉండగా 7,574 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - పెద్దాపురం

మద్యం మత్తులో జరిగిన వివాదం ఒక వ్యక్తి దారుణ హత్యకు దారి తీసిన సంఘటన సోమవారం రాత్రి స్థానిక కట్టమూరు పుంత రహదారిలో చోటు చేసుకుంది. పెద్దాపురం నుంచి కట్టమూరు వెళ్లే పుంత రహదారిలో కొందరు వ్యక్తులు సోమవారం రాత్రి మద్యం సేవిస్తూ గొడవ పడ్డారు. ఈ వివాదం ముదిరి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో కిర్లంపూడి మండలం గోనేడ గ్రామానికి చెందిన జానకి శ్రీనివాస్ (30)పై బీరు బాటిల్‌తో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శ్రీనివాస్ మరణించాడు. సమాచారం అందిన వెంటనే సిఐ విజయ్ శంకర్, ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సంఘటనపై చుట్టుపక్కల వారిని విచారిస్తున్నారు.

110 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏజెన్సీలోని సీలేరు ప్రాంతం నుండి తమిళనాడుకు తరలిస్తున్న 110 కేజీల గంజాయిని గండేపల్లి పోలీసులు పట్టుకున్నట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. తమిళనాడుకు ఒక కార్‌లో నలుగురు వ్యక్తులు 110. 640 కేజీల గంజాయిని 50 ప్యాకెట్లలో తరలిస్తుండగా గండేపల్లి వద్ద ఎస్ఐ శివ నాగబాబు అతని సిబ్బంది పట్టుకున్నారన్నారు. వారి వద్ద రూ.3500 నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

సారా తయారీ కోసం నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఇజెడ్ గ్రామ శివారు జీడితోటలో ఉన్న సారా తయారీకి డ్రమ్ముల్లో దాచి ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని కృష్ణంపాలెంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సారాను విక్రయిస్తున్న కడలి శ్రీనివాసును అరెస్టు చేశారు. అతని నుంచి 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు ఈ దాడుల్లో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డిఒ శ్రీరమణిని కలిసిన డిఎల్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం.శ్యామల సోమవారం ఆర్‌డిఒ శ్రీరమణిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడలో విధులు నిర్వహిస్తున్న శ్యామల సాధారణ బదిలీలలో భాగంగా ఈ నెల 13న పెద్దాపురంలో బాధ్యతలు స్వీకరించారు.

తేజేశ్వరరావుకు అవార్డు

ప్రజాశక్తి -కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ పిఒ టి.తేజేశ్వరరావు రెడ్ క్రాస్ సొసైటీ సేవా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తేజేశ్వరరావును అభినందించారు. ఎన్ఎస్ఎస్ విభాగాల ద్వారా తరచుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటామన్నారు. సేవా కార్యక్రమాల్లో ఆదిత్య విద్యా సంస్థలు ఎప్పుడూ ముందుంటాయని తెలిపారు. రక్తదానంపై ప్రజలు, విద్యార్థులలో అవగాహన పెంచడంలో తేజేశ్వరరావు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ్ మూర్తి తేజేశ్వరరావును అభినందించారు.

పెయింటింగ్ వర్కర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

గత నెలలో పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న గోపి వీర వెంకటరమణ దుర్గారావు కుటుంబానికి పాండవ గిరి పెయింటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.35 వేల ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ కమిటీ సభ్యుడు, పెయింటింగ్ మేస్త్రీ గరగపాటి రాజు వద్ద వీర వెంకటరమణ దుర్గారావు పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఈ సాయాన్ని మేస్త్రీ రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డి సత్యనారాయణ, యాసలపు మహేష్, కరణం అప్పారావు, నీలం శ్రీనివాసరావు, ఆర్ చంద్రశేఖర్, బల్ల భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

ప్రజాశక్తి -తుని

లోవ కొత్తూరు సమీపంలోని శ్రీతలుపులమ్మ తల్లి దేవస్థానం సమీపంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి హెచ్చరించారు. సోమవారం దేవస్థానం పరిసర ప్రాంతాల్లో యాత్రికుల కోసం ప్రైవేటు వసతి గృహాలు నిర్వహిస్తున్న యజమానులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తలుపులమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో ఆషాడ మాసం సందర్భంగా తలుపులమ్మలోవ అమ్మవారి దేవస్థానానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలిగించరాదని, జూదాలు, అసాంఘిక కార్యక్రమాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టర్‌కు ఎపిడబ్ల్యూజెఎఫ్ వినతి

ప్రజాశక్తి -కాకినాడ

జర్నలిస్టుల పిల్లల చదువులకు 50 శాతం రాయితీపై కలెక్టర్ ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు. దీనిపై కొన్ని ప్రైవేట్ కళాశాలలు నిరాకరించడంతో ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ సగిలిని కలిసి వాస్తవ పరిస్థితులను వివరించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వాతాడ నవీన్ రాజ్, ప్రధాన కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గునిపే శోభన్ బాబు మాట్లాడారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జిల్లావ్యాప్తంగా అమలయ్యే విధంగా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎంపీ హరీష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎంపీ హరీష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి -తాళ్లరేవు

ఉగ్రవాదంపై మన దేశం వైఖరి ప్రపంచ దేశాలకు చాటి చెప్పి స్వదేశానికి తిరిగి వచ్చిన అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు సోమవారం తాళ్లరేవులో ఘన స్వాగతం పలికారు. పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేట వద్ద టిడిపి సీనియర్ దళిత నాయకుడు జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపికి స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అంతకు ముందు స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్లమూరి సతీష్, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, ఉంగరాల వెంకటేశ్వరరావు, కట్టా త్రిమూర్తులు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, వెంటపల్లి ఉమామహేశ్వరి, రోళ్ల చక్రవర్తి, మోర్త బైరవమూర్తి, వస్కా రెడ్డి, గంటా గోపి, వడ్లమూరి సతీష్, దున్నా సింహాద్రమ్మ, పలివెల సింహాచలం, దడాల మోహన కుమార్, బండి లక్ష్మణబాబు, ఊడా రాంబాబు, సాధనాల కష్ణ, జక్కల అఖిల్, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మారుతీరావు మృతి

ప్రజాశక్తి -కోటనందూరు

బిళ్ళనందూరు మాజీ సర్పంచ్ మాతిరెడ్డి మారుతీరావు సోమవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మారుతీ రావు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, తుని ఎంఎల్‌ఎ యనమల దివ్య సంతాపం తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడి రాజబాబు, తుని మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు అంకంరెడ్డి రమేష్, లోవ దేవస్థానం చైర్మన్ పెంటకోట భాస్కర సత్యనారాయణ, గొర్లి అచ్చియ్యనాయుడు మారుతీ రావు భౌతికాయానికి నివాళి అర్పించారు.

శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీశ్రీకి ప్రజాసంఘాల ఘన నివాళి

ప్రజాశక్తి -కాకినాడ

మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్, జన విజ్ఞాన వేదిక, సాహితీ స్రవంతి తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం సాయంత్రం కాకినాడ వివేకానంద పార్క్ రాజా ట్యాంక్ ఆవరణలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర ఆర్ఎస్.జవహర్, రిటైర్డ్ ఎంపిడిఒ విశ్వనాథరెడ్డి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గనారా, అద్దేపల్లి ప్రభు, ఇబ్రహీం, శిరీష, జనార్ధన స్వామి, ఐ.ప్రసాదరావు, నాగేశ్వరరావు, విజయలక్ష్మి మాట్లాడారు. మేడిశెట్టి శ్రీరాములు, మలసాని శ్రీనివాస్, టి.అన్నారాం, అర్జునరావు, శ్రీనివాసాచారి, ఎన్‌వి.పద్మావతి, సిహెచ్.వేణు, ఎం.నాగలక్ష్మి, మలకా వెంకట రమణ, మేడిశెట్టి వెంకటరమణ, ఎం.హరనాథ్, సతీష్, పలివెల వీరబాబు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పిఠాపురం

పట్టణంలోని పాడా కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డిఐఒ) డాక్టర్ కెవి.సుబ్బారావు, పాడా పీడీ చైత్ర వర్షిణి అతిసార వ్యాధి నిర్మూలనపై సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. అతిసార వ్యాప్తి, నివారణ కోసం ఏమి చేయాలో వివరించారు. రెండు నెలలపాటు వ్యాధి పై అవగాహన కార్యక్రమలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 31 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఎపిడి వసంత మాధవి, ఎంపిడిఒ చిన్నారావు, మల్లం పిహెచ్‌సి సూపర్వైజర్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భూములపై పేదలకు హక్కులు కల్పించాలి

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

ఏళ్ల తరబడి వ్యవసాయ కూలీలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని, రైతాంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారు సూర్యప్రభకు వినతిపత్రం అందించారు. ఏగుపాటి అర్జున్ రావు, రాజాల రత్నం, పేరూరి లక్ష్మి, ఎస్.నారాయణమూర్తి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

పట్టణ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు మెప్మా రిసోర్స్‌పర్సన్స్ పని చేయాలని ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి టిడిపి కార్యాలయంలో మెప్మా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు ఉచితంగా ట్యాబ్‌లు అందించారు.

దోబీ ఘాట్ స్థలాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి -పిఠాపురం

మూలపేటలోని దోబీఘాట్ స్థలాన్ని పరిరక్షించి అభివృద్ధి చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాడా కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పాడా పీడీ చైత్ర వర్షిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు మాట్లాడారు. అప్పారావు, సూరిబాబు, వై.రాజు, లోవమ్మ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 61 అర్జీలు

ప్రజాశక్తి -పిఠాపురం

పట్టణంలోని స్థానిక పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి పాల్గొని ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై 61 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం కమిషనర్ కనకారావు, ఎపిడి వసంత మాధవి, ఎంపిడిఒ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

20న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా నాయకుడు, సాహితీవేత్త, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ యాసలపు సూర్యారావు 13వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20న యాసలపు సూర్యారావు భవనంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సిరపరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేయటం ద్వారా ఎందరో ప్రాణాలు నిలపవచ్చన్నారు. యువత ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయాలనుకునే యువకులు 9440787039, 9441754841, 7901697939 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కక్ష సాధింపులపై ఉన్న దృష్టి అభివృద్ధిపై లేదు

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్రంలో ప్రతిపక్ష సభ్యులపై కక్ష సాధింపులపై ఉన్న దృష్టి ప్రభుత్వానికి అభివృద్ధిపై లేదని వైసిపి పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు విమర్శించారు. సోమవారం సామర్లకోట వైసిపి కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు దొంగ హామీలతో అధికారం చేపట్టి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన నాయకుడు వైఎస్.జగన్ అన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి నాయకులపై కక్ష సాధింపులు, కేసులు బనాయింపులు చేయడం సరికాదన్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. నేటికీ ప్రజలలో జగన్ కున్న ఆదరణ కూటమి ప్రభుత్వం ఓర్వలేక పోతుందని అన్నారు. రానున్న ఎన్నికలలో జగన్ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, పాగా సురేష్ కుమార్, తలారి దొరబాబు, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజేష్, ఆవాల లక్ష్మీనారాయణ, సేపేని రూప, పాలిక కుసుమ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి దొరబాబు

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

ప్రజాశక్తి- తాళ్లరేవు, కాజులూరు

తాళ్లరేవు మండలం పి.మల్లవరం హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను సోమవారం విద్యార్థులకు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కెవి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం క్లాత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ చిరంజీవి, ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, నాయకులు ధూళిపూడి వెంకటరమణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, గుత్తుల వెంకటరమణ, విళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాజులూరు తణుకువాడ సర్పంచ్ నరాల సుబ్బరాజు విద్యార్థి మిత్ర కిట్లను హెచ్‌ఎం పంపాల కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. నాయకులు వల్ల అర్జున్‌రావు, పితాని సతీష్ కుమార్, వి.బాలకృష్ణ పాల్గొన్నారు.

కాజులూరులో విద్యార్థి మిత్ర కిట్లు అందిస్తున్న నాయకులు

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

పజాశక్తి-గండేపల్లి

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలో పరిణయ ఫంక్షన్ హాల్లో జగ్గంపేట రైతు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి కట్టుబడి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, పనిముట్లను అందిస్తున్నట్టు తెలిపారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అడపా భరత్ కుమార్, డైరెక్టర్లుగా సుంకవల్లి రాజారావు, ఎర్రంశెట్టి వెంకటలక్ష్మి, సింగలూరి రామదీపు, బుదిరెడ్డి శ్రీనివాస్, బోధిరెడ్ల సుబ్బారావు, కడారి లక్ష్మి, గుమ్మళ్ల అనంతలక్ష్మి, పీల వెంకటలక్ష్మి, నల్లమాటి మాధురి, దిబ్బ నాగమణి, మురళ్ళ నాగలక్ష్మి, షేక్ వల్లి, పిడుగు జయబాబు, దుర్గాప్రసాదులు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్ రావు, మారిశెట్టి భద్రం, ఎస్వీఎస్ అప్పలరాజు, అడబాల ఆంజనేయులు, జాస్తి వసంత్, బోల్లం రెడ్డి రామకష్ణ, రామకుర్తి నరసింహ, నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో నూతన కార్యవర్గం

అంగన్‌వాడీ బాలలకు పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల బాలలకు పుస్తకాలు సిద్ధం చేశామని సిడిపిఒ జి.ఉష తెలిపారు. సోమవారం నుంచి ఈ పుస్తకాలను ఆయా కేంద్రాలకు అందజేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పరిధిలో 289 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 3104 మంది బాలబాలికలు చదువుకుంటున్నారన్నారు. వీరందరికీ పిపి-1లో 4, పిపి-2లో 4 చొప్పున పుస్తకాలు అందజేస్తారన్నారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లరేవులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు తెలిపారు. స్థానిక సంతపేట సెంటర్ హైస్కూల్ పక్కన ఉన్న బాప్టిస్ట్ చర్చిలో ఈ శిబిరం నిర్వహించారు. పిఠాపురం సిఎంసి కంటి ఆసుపత్రి వైద్యులు అమృత్ ఆధ్వర్యంలో ఈ కంటి పరీక్షలు నిర్వహించారు. 61 మందికి శస్త్ర చికిత్సల కోసం పిఠాపురం తరలించారు. క్రీమ్ సేవాసంస్థ ప్రతినిధి, జెడ్‌పిటిసి సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిఎంసి వైద్యులు అమృత్

ప్రజల మెచ్చేలా సామాజిక సేవలు

ప్రజాశక్తి -శంఖవరం

లైన్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవలు ఉండాలని సత్యదేవ లైన్స్ క్లబ్ సలహాదారు డొంకాడ గిరి అన్నారు. సోమవారం లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని క్లబ్ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నూతన అధ్యక్షుడు అడపా సత్తిబాబు మాట్లాడారు. పొన్నాడ సూరిబాబు, కోశాధికారి బుడ్డిగ వాసును క్లబ్ పూర్వ కార్యవర్గ ప్రతినిధులు పర్వత జానకి, పంచాది గుర్రాజు, ప్రకాష్ నానాజీ అభినందించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భరత్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అడపా భరత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించి అనంతరం శ్రీరావులమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సన్మానించారు.

సమస్యలపై ఐక్య పోరాటాలకు నిర్ణయం

ప్రజాశక్తి -కాకినాడ

ఇపిఎఫ్ పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, మోసానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి పెన్షన్ సంఘాలు నిర్ణయించినట్టు ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు పూణే నుంచి సోమవారం ప్రకటనలో తెలిపారు. పూణేలోని మహా నగరపాలిక కార్మిక సంఘ భవన్‌లో ఈ నెల 14, 15న నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా సంయుక్త పోరాటం చేపట్టాలని తీర్మానించారన్నారు. దేశం నలుమూలల నుండి 25 కంటే ఎక్కువ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యే సదస్సు డిసెంబరు నెలలో ఢిల్లీలో నిర్వహించాలని నిర్ణయించారన్నారు. తరువాత రోజు డిమాండ్ల సాధనకు ఢిల్లీలో ధర్నా చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

నగర పంచాయతీకి పారిశుధ్య వాహనాలు

ప్రజాశక్తి -గొల్లప్రోలు

గొల్లప్రోలు నగర పంచాయతీకి పారిశుధ్య అవసరాల నిమిత్తం మూడు ట్రాక్టర్లు, 25 పుష్ ట్రక్స్, 100 డస్ట్ బిన్స్ కొనుగోలు చేశారు. సోమవారం వీటిని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ గొల్లప్రోలు మున్సిపల్ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు ప్రారంభించారు. అనంతరం మెప్మా సిబ్బందికి టాబ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లప్రోలు నగర పంచాయతీ పారిశుధ్యానికి అవసరమైన వాహనాలను కొనుగోలు చేయడం ద్వారా పట్టణంలో పరిశుభ్రత మెరుగుపడటానికి ఉపయోగపడుతుందని, త్వరలోనే డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ గొల్లప్రోలు నగర పంచాయతీకి స్పెషల్ గ్రాంట్ ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రఘు ప్రసాద్ మెప్మా అధికారి భారతి, నాయకులు కటారి తమ్మయ్యనాయుడు గుండ్ర సుబ్బారావు మామిడాల సూరిబాబు, పడాల ఏసు, బస సత్యనారాయణ, పేకేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళల చేతిలో అస్త్రం 'శక్తియాప్'

ప్రజాశక్తి - జగ్గంపేట

శక్తి యాప్ మహిళల చేతిలో పాశుపతాస్త్రం అని జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే ఈ యాప్ ఉన్న మొబైల్‌ను షేక్ చేసినా, ఎస్ఒఎస్ బటన్ నొక్కినా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెళ తుందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘునాథరావు, పాఠశాల హెచ్‌ఎం టివివిఎస్.రంగారావు, బేగం, బిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం

O.S. No. 105/2024

Between:-

State Bank of India, Rep by its Branch Manager, Divancheruru Branch, Rajamahendravaram Rural ...**Plaintiff**

And

Jami Murali Mohan Son of Rama Rao, Hindu Aged 44 years, LDC Employee,Primary Health Center, Maredumilli and residing at Flat No.101, Srvya Enclave,Bijapuri Township, Divancheruvu,Palacherla. ...**Deffendant**

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున **ది.23-06-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పుట్రేవు ఉపేంద్రకుమార్

రాజమండ్రి — అడ్వకేట్

ది.16-6-2025 — రాజమండ్రి

శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం

పోలవరం గ్రామం, పోలవరం మండలం, ఏలూరు జిల్లా

భూముల సేద్యమునకు కౌలు హక్కునకు బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామములో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, సంపూర్ణ హక్కు భుక్తములో గల ఈదిగువ నుదహరించిన భూములను 2025-2026 నుండి 2027-2028 సంవత్సరము వరకు అనగా 3 సంవత్సరముల కాలమునకు కౌలుకు సేద్యము చేసు కొనుహక్కునకు దేవదాయ ధర్మదాయ శాఖ చట్టం 30/1987 జి.ఓ.ఎం.ఎస్.నెం.397 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ.11.03.2001 మరియు జి.ఓ.ఎం.ఎస్.నెం. 425 (ఎండోమెంట్స్-1) శాఖ, తేదీ.09.11.2015 ప్రకారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో యీ దిగువ తెలిపిన తేదీలలో బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు ఈక్రింది షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పోలవరం గ్రామం.

వ. నెం.	భూమి యున్న గ్రామం, మరియు మండలం	సర్వే నెం.	విస్తీర్ణం య.సెం.	ధరావత్తు	బహిరంగవేలం జరుపు ప్రదేశం, తేదీ మరియు సమయము
1.	పురుషోత్తపట్నం గ్రామం సీతానగరం మండలం	91/1, 109/1	4.21	రూ.10,000	పురుషోత్తపట్నం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ది.03.07.2025 ఉదయం గం.10.00 లకు
		99/2	1.05	రూ.2,000	

వేలంపాట షరతులు :

1. ఈ వేలం పాట సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడుచున్నది.
2. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు వున్నవారుగానీ, దేవస్థానముతో ఎట్టి లావాదేవీలు వున్నవారుగానీ పాటలో పాల్గొనరాదు. పాట పాడుటకు తగిన అర్హత లేనివారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు.
3. అంగీకరింపబడిన పాటదారు పాటకొట్టివేసిన వెంటనే ఒక సం.రం శిస్తుసొమ్ము చెల్లించు నిర్ణయం.
4. ఇతర వివరములకు శ్రీ స్వామి వారి దేవస్థానం కార్యాలయము పనివేళలలో సంప్రదించవలెను.

ది.16.06.2025, పోలవరం — కార్యనిర్వాహణాధికారి, సెల్ నెం. 99486 11144

Notice

IN THE COURT OF THE HON'BLE V ADDL.DIST.JUDGE::GUNTUR

M.V.O.P.No:1268/ 2023

Between:

Munnangi Saraswathi & Others …… Petitioners

And

A.Veerabhadram & Others ... Respondents

To,

R-2: Aakula Parasuramudu,
S/o. Kannayya, R/o.Door No. 1-75,
Ganapathy Peta,Pedabrahmadevem,
Samalkota, East Godavari-533434
(Owner Of The Eicher Lorry Bearing No. Ap 39 V 88491)

పై నెంబరు O.P.ని పిటీషనర్లు యాక్షిడెంటుకి నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:30-06-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:30-06-2025

కొమ్మారెడ్డి రామకృష్ణా రెడ్డి,
పిటీషనర్లు తరపు అడ్వకేట్, గుంటూరు,

ప్రకటన

మహారాజశ్రీ ఏలూరు 7వ అదనపు జిల్లా కోర్టు (Family Court) లో

I.A.No. 143/2025 in O.S.No. 71/2023

Between:

Kusuma Raja Venkata Ramohan ...పిటీషనర్/ప్రతివాది

Vadlamudi Lavanya ...రెస్పాండెంట్/వాది

పై నెంబరులో రెస్పాండెంటు అయిన
వడ్లమూడి లావణ్య
W/o. రవికృష్ణ, D.No: 4-211/12
ధవలేశ్వరం, తూ॥గో॥జిల్లా.

అనువారు ఎన్నిమార్లు నోటీసు పంపినను పుచ్చుకోనందున Substitute of Service ద్వారా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయుచు **ది. 20-06-2025 వ తేదీన** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తగు సంజాయిషీ యివ్వవలసింది. లేనియడల పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

వాయిదా : 20-06-2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

D.S.V. Manikyala Rao

Eluru — Advocate

Date: 16-06-2025 — Eluru

Cell: 94401 11466

ప్రకటన

మహారాజశ్రీ ఏలూరు 7వ అదనపు జిల్లా కోర్టు (Family Court) లో

I.A.No. 144/2025 in O.S.No. 71/2023

Between:

Kusuma Raja Venkata Ramohan ...పిటీషనర్/ప్రతివాది

Vadlamudi Lavanya ...రెస్పాండెంట్/వాది

పై నెంబరులో రెస్పాండెంటు అయిన
వడ్లమూడి లావణ్య
W/o. రవికృష్ణ, D.No: 4-211/12
ధవలేశ్వరం, తూ॥గో॥జిల్లా.

అనువారు ఎన్నిమార్లు నోటీసు పంపినను పుచ్చుకోనందున Substitute of Service ద్వారా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయుచు **ది. 20-06-2025 వ తేదీన** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తగు సంజాయిషీ యివ్వవలసింది. లేనియడల పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

వాయిదా : 20-06-2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

D.S.V. Manikyala Rao

Eluru — Advocate

Date: 16-06-2025 — Eluru

Cell: 94401 11466